క్లుప్తంగా

వ్యాపారులందరూ.. ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని చిరు వ్యాపారులందరూ వెంటనే ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మారీసుపేటలో బుధవారం తెల్లవారుజామున ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరిగే పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే వ్యాపారులందరితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తాం



అమృతలూరు (కొల్లూరు) : అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గృహం స్థానంలో పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తామని ఎంపీడీఓ మారుతి శేషమాంబ అన్నారు. మండలంలోని ఇంటూరులో ఇటీవల దగ్ధమైన తాళ్లపల్లి సీతారామయ్య గృహాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్ని ప్రమాదం కారణంగా గృహం కోల్పోయి నిర్వాసితులైన బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందించడంతోపాటు, పక్కా గృహం మంజూరుకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

రామాయణం భారతీయులందరికీ ఆదర్శం



నగరం: రామాయణం భారతీయులందరికీ ఆదర్శమని సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర్రావు చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో మండలంలోని పెద్దవరం గౌడపాలెం రామ మందిరంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరాముని జీవితం భారతీయులకు ఆదర్శమని అందుకే గ్రామగ్రామాన రామాలయాలు నిర్మించుకుని సీతారామ కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత గ్రామ పురవీధులలో గోవింద నామ సంకీర్తన చేశారు. కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ సత్యనారాయణ, వెంకటేశ్వరావు, సాంబయ్య, మురళీకృష్ణ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని మిద్దె సెంటర్‌లో ఉన్న ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యుడు డాక్టర్ సులేమాన్ ఆధునిక కంప్యూటర్‌పై పరీక్షలు నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత కళ్లజోళ్లను అందజేశారు. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ఆడిట్ హెడ్ అఖిల్, టెరిటరీ మేనేజర్ ప్రదీప్, మంగళగిరి బ్రాంచ్ మేనేజర్ దీప్తి, బ్రాంచి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పశు ఆరోగ్యశిబిరాలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్యశిబిరాలు నిర్వహించారు. ఈశిబిరాలను గ్రామ నాయకులు ప్రారంభించారు. వేములూరిపాడు గ్రామంలో జరిగిన శిబిరంలో 80 పశువులకు అమీనాబాద్‌లో 50 దూడలకు నట్టల నివారణ మందు వేసినట్లు పశు వైద్యాధికారి షేక్ పీర్ అహ్మద్ తెలిపారు. అంతేకాక 24 పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు చెప్పారు. వేములూరిపాడులో 327 జీవాలకు షీప్ వ్యాక్సిన్ వేశామన్నారు. పాడి రైతులు శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులు గురించి వివరించారు. కటికల రామ కోటేశ్వరరావు, జెట్టి సుమన్, కోడూరి సదాశివరావు, భీమనాథుని శ్రీనివాసరావు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఎవరి వాహనమో..గుర్తుపట్టేదెలా?!



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నంబర్ ప్లేట్లు లేని బైక్‌లు



వాహనానికున్న క్యూఆర్ కోడ్‌ను తన ఫోన్‌తో స్కాన్ చేస్తున్న డీజీపీ సాంబశివరావు(ఫైల్)

కానరాని 'పిన్స్' క్యూఆర్ కోడ్‌లు

- 'ప్రాపర్టీ ఐడెంటిఫికేషన్ అండ్ నెట్‌వర్కింగ్ సిస్టమ్'(పిన్స్) అప్లికేషన్‌ను 2016లో ప్రారంభించిన అప్పటి డీజీపీ నండూరి సాంబశివరావు
- పోలీసు కేసుల్లో ఉన్న వాహనాలు, యజమానుల వివరాలు నమోదు చేసేందుకు రూపొందించిన యాప్
- వినియోగంలో లేకుండా పోయిన పిన్స్
- అప్పట్లో యాప్ తయారీలో కీలకంగా వ్యవహరించిన ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావు

తెనాలిరూరల్: పోలీసు కేసుల్లో ఉన్న వాహనాలు సాధారణంగా ఏళ్ల తరబడి ఆయా స్టేషన్ల ఆవరణల్లో ఉండిపోతుంటాయి. ఎండకు ఎండి, వానకు తడిచి శిథిలమైపోతుంటాయి. కోర్టుల్లో కేసుల విచారణ ఆలస్యమవడం, ఆయా వాహనాల యజమానులు పట్టించుకోకపోవడం వంటి పలు కారణాలు వాహనాలు పేరుకుపోతుంటాయి. కేసులు విచారణ దశకు వచ్చాక కొన్నిసార్లు ఈ శిథిలమైన వాహనాల్లో ఆయా కేసులకు సంబంధించిన వాహనా ఏవో గుర్తించడం కష్టతరంగా ఉంటుంది.

సాధారణంగా కేసుల్లో పోలీసుల అదుపులో ఉన్న వాహనాల వివరాలు ఖచ్చితంగా నమోదు చేస్తుంటారు. ఏళ్ల తరబడి వాహనాలు పేరుకుపోతుండడం, పాడైపోతుండడం, వాహనాల నంబర్ ప్లేట్లు దెబ్బతినడం వంటి కారణాలతో కేసులు కోర్టుల్లో విచారణకు వచ్చినప్పుడు సరైన వాహనాన్ని పోలీసు సిబ్బంది కొన్ని కొన్నిసార్లు గుర్తించడం కష్టంగా మారుతుండేది. దీనికి పరిష్కారంగా ప్రతి వాహనానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని, దాన్ని స్కాన్ చేస్తే వాహనానికి సంబంధించిన కేసు వివరాలన్నీ తెలుస్తాయని పోలీసు ఉన్నతాధికారులు భావించారు.

'పిన్స్' యాప్‌తో అనేక ప్రయోజనాలు

అధికారులు భావనకు తగ్గట్టుగానే వాహనాలకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, అలాగే సరైన యజమానులను గుర్తించేందుకు ఉపయోగపడే క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్‌ను జనరేట్ చేసే యాప్‌ను పోలీసు శాఖ రూపొందించింది. ఈ యాప్‌ను 2016 నవంబరులో అప్పటి డీజీపీ నండూరి సాంబశివరావు తెనాలిలోనే ప్రారంభించారు. ఏళ్ల తరబడి పోలీస్‌స్టేషన్లలో పడి ఉంటున్న వాహనాలను వాటి యజమానులకు అప్పగించడం లేదా వేలం వేయడానికి ఈ అప్లికేషన్ ఉపయోగపడుతుంది. నంబర్ ప్లేట్లు పాడై, వాహనాలు శిథిలమైనా ఈ కోడ్‌తో కేసు వివరాలను గుర్తించవచ్చు.

నంబర్ ప్లేట్‌పోయిన ఇంజిన్ నంబర్ లేదా ఛాసిస్ నంబరు ఆధారంగా వాహన యజమాని వివరాలు, తద్వారా కేసు వివరాలను తెలుసుకునే అవకాశం ఉన్నా అది కష్టతరంగా ఉండేది. కొన్ని వాహనాలను ఇంజిన్, ఛాసిస్ నంబర్లు సైతం కాలక్రమంలో పాడైపోతుంటాయి. ఇటువంటి వాహనాలు ఇక స్టేషన్లలో శిథిలమవ్వాల్సిందే. ఇటువంటి వాటికి ఈ యాప్ ఉపయోగపడుతుంది.

దేశంలోనే తొలి యాప్..

దేశంలోనే తొలిసారిగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ యాప్‌ను తయారు చేయించారు. 'ప్రాపర్టీ ఐడెంటిఫికేషన్ అండ నెట్‌వర్కింగ్ సిస్టమ్'(పిన్స్) అప్లికేషన్ అని ఈ యాప్‌కు పేరు పెట్టారు. 2016లో సీఐడీ అదనపు డీజీపీగా ఉన్న ప్రస్తుత రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ యాప్ విధి విధానాలను రూపొందించారు. దీని ద్వారా ఆరు క్యూఆర్ కోడ్‌లను జనరేట్‌చేయవచ్చు. ఎన్ని ఏళ్ల అనంతరమైనా ఈ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే వాహన వివరాలు, యజమాని వివరాలు, కేసు వివరాలన్నీ క్షణాల్లో తెలుస్తాయి. అయితే ప్రస్తుతం వాహనాలకు ఈ క్యూఆర్ కోడ్ కనబడడంలేదు. ఆ యాప్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలో ఉంచితే దేశ వ్యాప్తంగా అమలు చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం 'పిన్స్' యాప్‌ను పూర్తిగా పక్కన పడేశారు. ఇప్పటికైనా ఠాణాల్లో పేరుకుపోతున్న వాహనాలను వేలం వేయడం, పిన్స్ యాప్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉంది.

కౌలురైతులకు అందని ప్రభుత్వ సహకారం

సమావేశంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: కౌలురైతులకు బ్యాంకు రుణాలు, నష్టపరిహారం, సబ్సిడీలు అందక నష్టపోతున్నారని ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. కౌలురైతులు ప్రభుత్వం ఆదుకోకుంటే వారంతా వ్యవసాయం మాని కాడి కింద పడేస్తే, పంటభూములు బీళ్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రూరల్ మండల గ్రామం కొలకలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమ సాగర్ అధ్యక్షతన కౌలురైతుల సమావేశం నిర్వహించారు. కౌలురైతుల ఇబ్బందులను శివసాంబిరెడ్డి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎన్.ఉషారాణి మాట్లాడుతూ కౌలురైతులు నూటికి 70 శాతం ఉన్నారని వారికి రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎం.రంజిత్ కుమార్ మాట్లాడుతూ రైతు తీసుకుంటే కౌలు రైతులకు రుణాలు ఇవ్వటం సాధ్యం కాదన్నారు రైతు మిత్ర గ్రూపులు ద్వారా కూడా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. వీఆర్వో ప్రసన్నకుమారి మాట్లాడుతూ రైతుల అంగీకారం లేకుండా సీసీఆర్సీ కార్డులు ఇవ్వటం సాధ్యం కాదన్నారు. పంచాయతీ కార్యదర్శి పుణ్యగంటి జయదేవ్ మాట్లాడారు. రైతులు, కౌలు రైతుల సందేహాలను రైతులు నివృత్తి చేశారు.



మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

తెనాలిలో పునఃప్రారంభమైన ప్రత్యేక సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వినికిడి, దృష్టి లోపం కలిగిన వికలాంగుల ధృవపత్రాల పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. గత బుధవారం నుంచి మూడు రోజుల పాటు దీనిని నిర్వహించిన విషయం తెలిసేందే. ఈవారం కూడా క్యాంప్‌ను నిర్వహించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సదరం క్యాంప్‌ను అధికారులు నిర్వహించారు. క్యాంప్ వద్ద వికలాంగులకు కూర్చునేందుకు అవసరమైన టెంట్లు, కుర్చీలు, మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. కానీ అక్కడ త్రాగేందుకు గ్లాస్‌లు ఏర్పాటు చేయకపోవటంతో వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. ఈఎన్‌టీ విభాగంలో 53 మందిని, అప్తామాలజీ విభాగంలో 80 మంది వికలాంగులకు వైద్య పరీక్షలు చేశారు. క్యాంప్‌లో నర్సారావుపేట ప్రభుత్వ వైద్యశాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఎం చంద్రబాబు, సత్తెనపల్లి నుంచి వచ్చిన డాక్టర్ మాధురిలు, బాపట్ల నుంచి వచ్చిన అప్తామాలజీ వైద్యులు డాక్టర్ ఆషాకిరణ్, నరసరావుపేట నుంచి వచ్చిన డాక్టర్ ఎన్.హేమశ్రీలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు. గురు, శుక్రవారాలలో కూడ శిబిరం కొనసాగుతుందని ఆమె చెప్పారు.

విద్యతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి

ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్

రేపల్లె రూరల్: విద్యార్థులు విద్యతో పాటు సేవా కార్యక్రమాల్లోను చురుకుగా పాల్గొనాలని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్ర కుమార్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. సేవా కార్యక్రమాలలో పాల్గొనే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు సహకార భావం ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా పని విలువ తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.దాసు, కళాశాల వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ ఎం.బుజ్జి, ఎన్‌సీసీ ఆఫీసర్ బాలగురవయ్య, అధ్యాపకుడు బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పిచ్చిచెట్లను తొలగిస్తున్న ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఓంకార నాదమే త్రిమూర్తి స్వరూపం

రేపల్లె రూరల్: ఓంకార నాదం త్రిమూర్తి స్వరూపంగా చెప్పబడుతుందని ప్రణవ ఆశ్రమ నిర్వాహకులు సుమిత్రానంద సరస్వతీ మాతాజీ చెప్పారు. ఓంకార నాద విశిష్టతపై పట్టణంలోని రింగురోడ్డు సెంటర్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సత్సంగంలో ఆమె మాట్లాడారు. ఓంకారాన్ని గ్రహించిన వారు పరమాత్మతో ఏకం చేసుకోగల శక్తివంతులవుతారన్నారు. ఇదొక ఏకాక్షర మంత్రమని, సృష్టి ఉత్పత్తి ప్రక్రియ ఈ ఓంకార శబ్దంతో జరిగిందని తెలిపారు. అత్యంత శక్తివంతమైన ఓంకార నాద జపంతో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులవుతారన్నారు. అటువంటి శక్తివంతమైన నాదాన్ని నిత్యం జపించేందుకు కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎంబీఎల్ నారాయణమూర్తి, కోడే గౌరీశంకర్, పీవీకే సాంబశివరావు, ఎస్ఎస్ నాగేశ్వరరావు, మల్లెల రామచంద్రరావు, నాగలీల, పట్టణ ప్రజలు, ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక సందేశాన్నిస్తున్న సుమిత్రానంద సరస్వతీ మాతాజీ

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సీపీఎం 27వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్ కోరారు. బుధవారం స్థానిక రథం సెంటర్‌లో మహాసభ పోస్టర్లను స్థానిక నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నెల్లూరులో జరగనున్న రాష్ట్ర మహాసభలలో ప్రజా పోరాటాలపై ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రజా ఉద్యమాల కోసం జరుగుతున్న మహాసభలకు ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, పి.మనోజ్‌కుమార్, బట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు, గుంటూరు దానియేలు పాల్గొన్నారు.



సీపీఎం రాష్ట్ర మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇరువురిపై కేసు నమోదు

తాడికొండ: అక్రమంగా భూ స్వాధీనం, బెదిరింపులు, దాడి వ్యవహారంలో ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. వివరాల ప్రకారం తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన అనమర్లపూడి శేషగిరిరావు తనకున్న 0.64 సెంట్ల భూమిని నిడమర్రు గ్రామానికి చెందిన తాడిబోయిన గోపయ్య వద్ద రిజిస్ట్రేషన్ చేసి రూ.30 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు గాను వడ్డీతో సహా నగదు తిరిగి చెల్లించిన తర్వాత మళ్లీ భూమి ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నాడు. అయితే అప్పుగా ఇచ్చిన నగదు తిరిగి చెల్లించినప్పటికీ తాడిబోయిన గోపయ్య భూమిని తిరిగి ఇవ్వడానికి నిరాకరించడంతో పాటు దురుసుగా ప్రవర్తించి ఆయన కుమారుడితో కలిసి అసభ్య పదజాలంతో దూషించి, బెదిరించి దాడి చేశారు. కంతేరు శివారులో జరిగిన ఈ దాడిపై బాధితుడు శేషగిరిరావు తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కార్మికులు ఈ శ్రమ్ కార్డులు కలిగి ఉండాలి

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభాకరరావు

రేపల్లె రూరల్: ఈ శ్రమ్ కార్డుల ద్వారా కార్మికులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధిని పొందవచ్చని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జీ ప్రభాకరరావు తెలిపారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కార్మిక శాఖ పరిధిలోని ఏడు మండలాల్లో షాపులు, హోటళ్లు, పెట్రోలు బంకుల్లో ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద పనిచేస్తున్న కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వివిధ సంస్థల్లో పని చేసే కార్మికులందరూ తప్పనిసరిగా ఈ శ్రమ్ కార్డులను పొందాలన్నారు. కార్డులకై కార్మికులు అన్ని వేళలా ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లతో లేబర్ ఆఫీసులో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉచితంగా దరఖాస్తు చేసుకుని కార్డులు పొందాలని సూచించారు. అదే విధంగా 17 సంవత్సరాలలోపు చిన్నారులతో దుకాణాలలోగానీ, ఇతర సంస్థల యజమానులుగానీ పనులు చేయిస్తే సంస్థ యజమానులపై లక్ష రూపాయల జరిమానాతో పాటు సంవత్సరం జైలు శిక్ష విధించబడునని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కరించాలని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మిక పోరాట సాధన కన్వీనర్ కూరపాటి స్టీవెన్ అధ్యక్షతన ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు, సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావులు సందర్శించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నారా లోకేష్ ఏసీసీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని మంత్రి నిలబెట్టుకోవాలన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఏసీసీ ఆస్తులను పాడుకున్నారో వారే కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16వ తేదీ ఆల్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులతో సభను ఏర్పాటు చేసి, పోరాటం ఉధృతం చేస్తామని స్టీవెన్ హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు కంచర్ల కాశయ్య, ఐఎన్‌టీయూసీ నాయకుడు డి.శామ్యూల్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.కోటేశ్వరరావు, కె.ఆదినారాయణ, బి.అంకయ్య, ఆశీర్వాదం, నాగేశ్వరరావు, శారమ్మ, వేముల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు

పెదపాలెంలో మేరీమాత మహోత్సవం

అంగరంగ వైభవంగా తేరు ప్రదక్షిణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెంలో యేసు తిరు హృదయ దేవాలయం ఆర్‌సీఎం చర్చిలో మేరీమాత మహోత్సవం సందర్భంగా తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఫాదర్ జోసఫ్ ప్రభుకుమార్, ఫాదర్ జోసఫ్ రెడ్డి, నూతక్కి విచారణ గురువు మందా ఆంథోని రాజు ఆధ్వర్యంలో దివ్య బలిపూజ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు భారీగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై మేరీమాతను ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంఘ పెద్దలు విన్సెంట్‌పాల్,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి



మాలతి (ఫైల్)

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువతులు తీవ్రంగా గాయపడగా, ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పట్టణ నాజరుపేటకు చెందిన రమ్య, మల్లెపాడుకు చెందిన చిలుమూరి మాలతి (22) గుంటూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ప్రతి రోజు ఆక్టివాపై వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీ రాత్రి విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా తెనాలి మండలం సంగం జాగర్లమూడి, అంగలకుదురు గ్రామాల మధ్య ఎదురుగా పల్సర్ బైక్‌పై వచ్చిన చేబ్రోలు మండలం శలపాడుకు చెందిన వ్యక్తి వీరి వాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఘటనలో ఇద్దరు యువతులు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వడ్లమూడి సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అక్కడ నుండి తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. మాలతి పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోస్ట్‌మార్టమ్ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించగా, సాయంత్రం మల్లెపాడులో అంత్యక్రియలు నిర్వహించారు.

హ్యాండ్ బాల్ పోటీలకు తెనాలి క్రీడాకారులు

తెనాలిఅర్బన్: జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్‌కు చెందిన జనార్దన్ రెడ్డి, కల్యాణ్‌లు ఎంపికైనట్లు కోచ్ నాగరాజు బుధవారం తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరనున్న జాతీయ పోటీలలో వీరు పాల్గొంటారని చెప్పారు. వీరిని డబుల్ హార్స్ ఫౌండేషన్ నిర్వాహకులు, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర రావులు అభినందించారు.

బ్రిడ్జి కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

తెనాలి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు

తెనాలిఅర్బన్: ఐటీఐ పూర్తిచేసి పాలిటెక్నిక్ డిప్లామా రెండవ సంవత్సరంలో నేరుగా చేరదలచిన విద్యార్థుల కోసం బ్రిడ్జి కోర్సును నిర్వహించనున్నట్లు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, వాటి జిరాక్స్ కాపీలతో ఫిబ్రవరి 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నెంబర్: 9014491772, 9347795839 నెంబర్‌లలో సంప్రదించాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుగ్గిరాల, చిలువూరు స్టేషన్ల మధ్య మంచికలపూడి రైల్వే గేటు సమీపంలో సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులు అరెస్ట్

కొల్లిపర: మండల పరిధిలోని పాతబొమ్మువానిపాలెం గ్రామంలో బుధవారం పంట పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 6810, నాలుగు బైకులు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుల్ కూర్మారావు, ఆశోక్ ఉన్నారు.

ఫిబ్రవరి 3 నుంచి అమరలింగేశ్వరుని ప్రతిష్టా మహోత్సవాలు

రేపల్లె రూరల్: మండలంలోని కారుమూరు గ్రామంలో పునఃనిర్మించిన లలితా పరబ్రహ్మేశ్వరి సమేత అమరలింగేశ్వరస్వామి వార్ల ప్రతిష్టా మహాకుంభాభిషేక మహోత్సవాలు ఫిబ్రవరి 3 నుంచి 7వ తేది వరకు నిర్వహించబడునని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 6వ తేదీ వరకు నూతన ఆలయంలో ప్రత్యేక హోమాది పూజలు నిర్వహించి, 7వ తేదీన ఉదయం 11.26 గంటలకు స్వామి, అమ్మవార్ల విగ్రహాలు ప్రతిష్ఠించబడునని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపు మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో 31వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

4న కొల్లూరు మండల పరిషత్ సమావేశం

కొల్లూరు: కొల్లూరు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం వచ్చే నెల 4న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.నరసింహారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు శాఖాపరమైన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

2 నుంచి దత్తాత్రేయస్వామి పీఠం వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని శ్రీదత్త పీఠం ఆధ్వర్యంలో పీఠం వార్షికోత్సవం 2,3,4 తేదీల్లో నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు జయశంకర్ బుధవారం తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా మహాచండీహవనం, సాయంత్రం 7గంటలకు మహారుద్రాభిషేకం వేద పండితులచే నిర్వహిస్తామన్నారు. 3న ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం శ్రీచక్రస్నానం, సుదర్శన హవనం ఉంటుందన్నారు. 4న దత్తాత్రేయ హవనం, ప్రత్యేక పూజలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు.